# సైకాలజీ

ఎస్. శివనాగేశ్వరరావు

**శ్రీకీర్తి తెలుగు సినిమా ప్రేక్షకుల స్వప్నసుందరి. ఆమె హీరోయిన్‌గా నటించిన సినిమాలకు మంచి డిమాండ్ వుంది. ఆమె వుంటే చాలు సినిమా హిట్ అవుతుందని నిర్మాతలకు సెంటిమెంట్. హిట్స్ పెరిగినకొద్దీ ఆమె రెమ్యూనరేషన్ కూడా అంచెలంచెలుగా పెరిగిపోయింది.**

విజయం అనేది చాలా కొద్దిమందికి మాత్రమే ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఎక్కువ మందికి అహంకారాన్ని పెంచుతుంది. శ్రీకీర్తి పట్ల కూడా అదే జరిగింది. ఆమెలో అహంకారం పెరిగిపోయింది. నిర్మాతలను చిన్నచూపు చూడసాగింది.

నిర్మాతలు ఆమె పట్ల విధేయతగా మెలుగుతూనే ప్రత్యామ్నాయం కోసం చూడసాగారు. సినీఫీల్డ్‌లో సక్సెస్ ఏనాడూ ఒక్కరినే అంటపెట్టుకొని వుండదు. కొత్త నీరు వచ్చి పాత నీరును తోసిపారేస్తుంటుంది. శ్రీకీర్తి విషయంలోనూ అలానే జరిగింది. ఆమెకు కష్టకాలం వినీల రూపంలో సాక్షాత్కరించింది.

వినీల హీరోయిన్‌గా నటించిన రెండు, మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అంతటితో ఆమె చరిత్ర ముగిసిందనే అందరూ అనుకున్నారు. అయితే శ్రీకీర్తి తనను మలకన చేసి మాట్లాడ్డంతో కోపగించిన ఒక కమర్షియల్ డైరెక్టర్ తన సినిమాకు హీరోయిన్‌గా వినీలను బుక్ చేశాడు. అంతేకాదు... శ్రీకీర్తి మీద కోపంతో... వినీల క్యారెక్టర్‌ను అద్భుతంగా తీర్చిదిద్ది ఆమెను వెండితెర మీద గొప్ప గ్లామరస్‌గా చూపించాడు. ఆ సినిమా సూపర్‌హిట్ కావడంతో వినీల పేరు మారుమోగిపోయింది.

నిర్మాతలు ఎప్పుడూ విజయపథాన నడిచే తార కోసమే ఎగబడతారు. అలానే వినీల కాల్షీట్స్ కోసం క్యూలు కట్టారు. కొందరయితే శ్రీకీర్తికిచ్చిన అడ్వాన్స్ కూడా వదులుకొని వినీల కోసం ప్రయత్నం చేయసాగారు.

అది చూసిన శ్రీకీర్తికి వినీల మీద గొంతు వరకు కోపం వచ్చింది. ఏదో ఒక సినిమా హిట్టయితే సరిపోతుందా? తరువాత వరస ఫ్లాప్‌లతో భయపడి నిర్మాతలు తన దగ్గరకు పరిగెత్తుకు వస్తారని ఊహించింది.

అయితే వినీల విషయంలో అలా జరగలేదు. ఆమెలో గ్లామర్ కాక టాలెంట్ కూడా వుంది.

పైగా విద్యాధికురాలు కావడంతో అందరితో స్నేహంగా, వినయంగా మసలుకునేది. దానితో ఆమె సూపర్ హీరోయిన్‌గా స్టాండయిపోయింది.




వినీల కాల్షీట్స్ దొరక్కపోతే తప్పనిసరై మాత్రమే నిర్మాతలు శ్రీకీర్తి దగ్గరకు రాసాగారు.

వెండితెర మీద ఆమె స్థానం నంబర్ వన్ నుంచి నంబర్ టూకి పడిపోయింది.

అది శ్రీకీర్తికి గొప్ప విషాదాన్ని మిగిల్చింది. ఆమె మనసులో వినీల మీద క్షణక్షణానికి కసి

## 'విడాకులు...'

వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌లతో బిజీగా వున్న భారత క్రికెట్ క్యాప్టెన్ అజహరుద్దీన్‌తో బాటు అతగాడి ప్రియురాలు సంగీత్ బిజలానీ కూడా అతనిని అనుసరిస్తూ బిజీగా వున్నదన్న వార్త గుప్పుమంటుంటే మరో పక్క అజహర్ అతని భార్య 'నరేన్'కు విడాకులు ఇచ్చాడన్న వార్త కూడా గుప్పుమంది. ఇద్దరు పిల్లల తండ్రి అజహర్‌కి ఇద్దరు ప్రియుళ్ళ ప్రియురాలు సంగీతాకు జరుగుతున్న ఈ 'మ్యాచ్'లో సంగీతా గెలిచింది. అజర్ తన భార్య



'నరేన్'కు రంజాన్ రోజున విడాకులిచ్చినట్లు పత్రికలవారికి చెప్పాడు.

న్యూస్‌నెట్‌వర్క్

పెరిగిపోసాగింది. ఏదైనా స్టుడియోలో వినీల ఎదురై నవ్వుతూ విష్ చేసినా, శ్రీకీర్తి ముఖం చిట్లించేది. 'దీన్ని గొంతు పిసికి చంపాలి. వెధవ నవ్వు ఇదీను...' అని మనసులో తిట్టుకునేది.

మనిషి మనసులో అసూయ ప్రవేశించకూడదు. ప్రవేశిస్తే అది 'ఇంతింతై... వటుడింతై...' అన్నట్లు పెరిగిపోయి, చివరికి హృదయం చాలక మనిషికి పిచ్చెక్కిస్తుంది. అటువంటప్పుడు ఏదో ఒకటి చేసి దాన్ని మనసు నుంచి దూరంచేయాలి. శ్రీకీర్తి విషయంలోనూ అదే జరిగింది.

మనసులో పెరిగిపోతున్న వినీల పట్ల కసిని ఎలా వదిలించుకోవాలో ఆమెకు అర్థంకాలేదు. వినీలను కసిగా తిట్టుకునేది. శాపనార్థాలు పెట్టేది. వినీల స్టిల్స్ వున్న సినిమా పత్రికలను ముక్కలు ముక్కలుగా చించేది. అగరొత్తి వెలిగించి వినీల ఫోటోలకు బొజ్జాలు పొడిచేది. స్టిల్స్‌లోని వినీల అందమైన రూపాన్ని పెన్నుతో వికృతంగా మార్చివేసేది. ఏం చేసినా శ్రీకీర్తి కసి పోలేదు.

అందుకే వినీల మీద కసి తీర్చుకునే ఉపాయం చెప్తే మంచి బహుమతి ఇస్తానని క్లోజ్ ఫ్రెండ్స్‌తో చెప్పింది. అందరూ ఆ విషయమై తల బద్దలుకొట్టుకోసాగారు.

శ్రీకీర్తి పి.ఎ. శశికాంత్ కూడా ఆ విషయం గురించి ఆలోచించాడు. ఏం చేస్తే శ్రీకీర్తి కసి తీరుతుంది? ఎలా బహుమతి కొట్టేయాలా? అని ఆలోచించిన శశికాంత్‌కి హఠాత్తుగా మనోహర్ జ్ఞాపకానికి వచ్చాడు.

మనోహర్ ఒక చిన్న రచయిత. అరా, కొర సినిమాలకు రచనలు చేసి అవి ఫట్టేల్మని పేలిపోవడంతో, భవిష్యత్తు అంధకార బంధురమైపోయి, వాళ్ళకూ వీళ్ళకూ తన కథలు వినిపించి ప్రాణం తీస్తుంటాడు. అతను శశికాంత్‌కి మంచి ఫ్రెండ్.

మనోహర్ తరుచూ 'హ్యూమన్ సైకాలజీ తెగ స్టడీ చేసా!' అని అంటూ వుండడం శశికాంత్ విన్నాడు. మనోహర్‌తో చెప్తే శ్రీకీర్తి సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావించిన శశికాంత్, మనోహర్ని కలిసి శ్రీకీర్తికి వినీల మీదున్న ద్వేషం గురించి చెప్పి, వినీల మీద శ్రీకీర్తి కసి తీర్చుకునే ఉపాయం చెప్పమని, అందువల్ల తనకు మంచి బహుమతి దక్కుతుందని చెప్పాడు.

శశికాంత్ చెప్పినది విన్న మనోహర్ అలవాటుగా 'హ్యూమన్ సైకాలజీ తెగ స్టడీ చేసా! ఈ సమస్యను చిటికలో పరిష్కరిస్తా! అయితే చిన్న షరతు' అన్నాడు. 'ఏమిటో చెప్తు' అన్నాడు శశికాంత్ ఆత్రుతగా. 'మరేం లేదు. నీకు దక్కిన బహుమతి ఫిఫ్టీ... ఫిఫ్టీ పంచుకుందాం' అన్నాడు మనోహర్. శశికాంత్ అయిష్టంగానే 'ఓయస్...' అన్నాడు.

మనోహర్ చేయవలసింది చెప్పాడు. అది విన్న శశికాంత్ హుషారుగా ఈలవేసాడు. మరునాడు శశికాంత్ ఒక బుజ్జి బొచ్చు కుక్కపిల్లను తీసుకుపోయి 'మేడమ్! మీకు నా కానుక!' అని కుక్కపిల్లను ఆమె చేతిలో పెట్టాడు. 'ఎందుకీ కానుక?' అని ప్రశ్నించింది శ్రీకీర్తి. 'వినీల మీద మీకున్న అక్కసు తీర్చుకోవడానికి' అన్నాడు శశికాంత్.

వినీల పేరు వినగానే శ్రీకీర్తి ముఖంలో ఫీలింగ్స్ మారాయి. 'ఎలా?' అని ప్రశ్నించింది. శశికాంత్ కుక్కపిల్లను అందుకొని కొంచెం దూరంగా విడిచిపెట్టి వచ్చి 'వినీ! ఏయ్ వినీ!" అని కేకవేసాడు. కుక్కపిల్ల పరిగెత్తుకువచ్చి అతని కాలు నాకసాగింది. అది చూసిన శ్రీకీర్తి ముఖం వెలిగిపోయింది. 'ఫెంటాస్టిక్... అయితే దీని పేరు వినీల అన్నమాట' అంది. 'యస్... మేడం...' అన్నాడు శశికాంత్.

శ్రీకీర్తి 'వినీ! బ్లడీ వినీ! కమ్ హియర్' అని కేకేసింది. కుక్కపిల్ల శ్రీకీర్తి దగ్గరకు పోయి ఆమె కాలు నాకింది. శ్రీకీర్తి దాన్ని ధన్‌మంటూ కాలితో తన్నింది. అది పోయి దూరంగా పడింది. శ్రీకీర్తి మరలా 'వినీ! కమ్... కమ్...' అని కేకవేసింది. కుక్కపిల్ల లేచి 'కుయ్... కుయ్' మంటూ అరుచుకుంటూ వెళ్ళి శ్రీకీర్తి కాలు నాకింది. శ్రీకీర్తి మరలా దాన్ని కాలితో తన్ని పెద్దగా నవ్వుతూ 'వెరీ నైస్ శశికాంత్... మంచి గిఫ్ట్ ఇచ్చావు. దీన్ని చూస్తుంటే వినీలే నా కాలి దగ్గర పడి వున్నట్లుంది. ఎప్పటికో దానికీ ఈ గతి పట్టక తప్పదు' అని శశికాంత్‌ని మెచ్చుకుంది.

'థాంక్స్ మేడం...' అంటూ నసిగాడు శశికాంత్. 'ఏదో చెప్పాలనుకుంటున్నావు. చెప్పు' అంది శ్రీకీర్తి. 'ఏం లేదు మేడం... మీ కసి తీరిస్తే మంచి బహుమతి ఇస్తానన్నారు' అన్నాడు శశికాంత్.

'యస్సెస్... మరిచేపోయాను. తప్పక ఇస్తాను' అని శ్రీకీర్తి లోనికి పోయింది. ఆమె ఇచ్చే బహుమతి ఊహించుకుంటూ శశికాంత్ మైమరచిపోయాడు.

అంతలో శ్రీకీర్తి బయటకు వచ్చి అతని చేతిలో పది కాగితం పెట్టింది.

'ఏంటిది మేడం?' అన్నాడు శశికాంత్. 'బహుమతి. సారీ! మిస్టర్ శశికాంత్! నా దృష్టిలో వినీలకు ఇంతకంటే విలువ లేదు. అందుకే కుక్కతో సమానమైన వినీలకు పది రూపాయిలు మాత్రమే ఇచ్చాను' అని ఒయ్యారంగా లోనికి నడిచింది. కుక్కపిల్ల ఆమె వెనకే పరుగుతీసింది.

తన రూమ్‌కి వచ్చిన శశికాంత్‌ని చూడగానే మనోహర్ 'ఏం ఫ్రెండ్! నా అయిడియా హిట్టా? ఫ్లాపా?' అని ఆత్రంగా అడిగాడు. 'సూపర్ హిట్' అన్నాడు శశికాంత్. 'నే చెప్పలా! హ్యూమన్ సైకాలజీ తెగ స్టడీ చేసానని. నీ కిచ్చిన బహుమతిలో సగం నాకు కొట్టు' అన్నాడు చేయి చాపుతూ.

శశికాంత్ జేబులోంచి అయిదు కాగితం తీసి మనోహర్ చేతిలో పెట్టాడు. 'ఏమిటిది?' అని నోరు వెళ్ళబెట్టాడు మనోహర్. 'నా కిచ్చిన బహుమతిలో నీవాటా!. నీవు చెప్పినట్లే శ్రీకీర్తి కసి తీరింది. అయితే ఆమె దృష్టిలో వినీలకు పది రూపాయిల కంటే విలువ లేదని పది చేతిలో పెట్టింది' అన్నాడు శశికాంత్.

'ఇది మాత్రం స్టడీ చేయలేకపోయాను' అని హతాశుడయ్యాడు ది గ్రేట్ రైటర్ మనోహర్!!